KANCHARLA
# మనసులో మాట
## తెలంగాణ
| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
|---|---|---|---|---|
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

గురువారం 28 మే 2026



## తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

- నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి: వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్
- సకాలంలో కొనుగోళ్లు జరిపి ఉంటే రైతులకు ఈ దుస్థితి వచ్చేది కాదు
- హామీల అమల్లో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైంది: మాజీ మంత్రి ధ్వజం

2



# కల్లాల్లోనే కాటేసిన అకాల వర్షం!

- ఉరుములు, ఈదురుగాలులతో ఉమ్మడి జిల్లాల్లో వరుణుడి బీభత్సం
- తడిసి ముద్దయిన వరి ధాన్యం.. అన్నదాతల గుండెల్లో గుబులు
- సకాలంలో రాని లారీలు.. మిల్లింగ్ తరుగు పేరుతో నిలువు దోపిడీ

2



## ధాన్యం కొనుగోళ్లు వేగవంతంచేయాలి

- వర్షాలకు తడవకుండా టార్పాలిన్లు సిద్ధం చేయాలి: అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- రాష్ట్రంలో 'ఆరెంజ్ అలర్ట్'.. అత్యవసర పరిస్థితులపై యంత్రాంగం అప్రమత్తం
- అవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని ముఖ్యమంత్రి సూచన

2



## త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ



- జూన్ ఒకటిన మరో రెండున్నర లక్షల ఇళ్లకు సీఎం రేవంత్ శ్రీకారం
- మహిళల పేరు మీదుగా రూపాయి ఫీజు లేకుండానే రిజిస్ట్రేషన్లు
- ఒక్క ఇల్లయినా కట్టి ఉంటే సన్యాసం తీసుకుంటానన్న కేటీఆర్ సవాల్
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గానికి పది ఇళ్లు కూడా కట్టలేదు
- గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

02

## రైతుల ఆగ్రహంలో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయం

- మునిగే పడవలో మాజీ ఎమ్మెల్యే
- హరీష్ ఢిల్లీ టూర్ వెనుక మతలబు
- కవిత కొత్త పార్టీ సంచలనం
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

05



## కాళేశ్వరంలో ముగింపునకు సరస్వతి అంత్య పుష్కరాలు

- ఘాట్ల వద్ద పోటెత్తిన భక్తుల రద్దీ.. పవిత్ర స్నానాలు ఆచరించిన హంపి పీఠాధిపతి
- కాళేశ్వరంలో భక్తుల జాతర!

05



## కల్లాల వద్ద దైన్యంగా రైతులు.. పంటల కొనుగోలు లేక దీనావస్థ

- తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలి
- ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం
- అన్నదాతలకు బీఆర్ఎస్ శ్రేణులు అండగా నిలవాలి
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు సెల్‌ఫోన్ వెలుతురులో వడ్లు కాపాడుకుంటున్న దుస్థితి.. కాంగ్రెస్ సర్కార్‌ది మొద్దునిద్ర

05

# కల్లాల్లోనే కాటేసిన అకాల వర్షం!

- ఉరుములు, ఈదురుగాలులతో ఉమ్మడి జిల్లాల్లో వరుణుడి బీభత్సం
- తడిసి ముద్దయిన వరి ధాన్యం.. అన్నదాతల గుండెల్లో గుబులు
- సకాలంలో రాని లారీలు.. మిల్లింగ్ తరుగు పేరుతో నిలువు దోపిడీ



**హైదరాబాద్ (మనసులో మాట):** భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు అకాల వర్షం ఎండల నుండి తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పటికీ, ఐనకాని కాలంలో వచ్చిన వాన అన్నదాతల పాలిట శాపంగా మారింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలోని పలు ఉమ్మడి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఆరుగాలం శ్రమించి, అప్పులు తెచ్చి పండించిన పంట.. చేతికందే తరుణంలో కళ్ల ముందే నీటిపాలవడంతో రైతాంగం కన్నీటిపర్యంతమవుతోంది.

## ములుగులో అత్యధికంగా 12.3 సెం.మీ వర్షపాతం

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మంగళవారం రాత్రి రికార్డు స్థాయిలో అకాల వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా ములుగులో అత్యధికంగా 12.3 సెం.మీ వర్షపాతం నమోదు కాగా, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ, నల్గొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ చొప్పున వర్షం పడింది. భారీ గాలుల కారణంగా సంగారెడ్డి, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో వందలాది విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కామారెడ్డి జిల్లాలో వరద ఉధృతికి కల్లాల్లో ఆరబోసిన వందలాది క్వింటాళ్ల ధాన్యం కొట్టుకుపోయింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది.

## కాంటాల వద్ద కన్నీటి జాతర!

'రెక్కలు ముక్కలు చేసుకుని పంట పండిస్తే.. తీరా కొనుగోలు కేంద్రాలకు తెచ్చాక ప్రభుత్వం నరకం చూపిస్తోంది' అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఐకేపీ, సహకార కేంద్రాల్లో అస్తవ్యస్త ఏర్పాట్లు అన్నదాతలకు శాపంగా మారాయి.

గన్నీ సంచుల కొరత: కేంద్రాలకు ధాన్యం తెచ్చి నెలలు గడుస్తున్నా సంచులు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిల్లర్ల దోపిడీ: తరుగు పేరుతో క్వింటాలుకు 5 నుంచి 10 కిలోల వరకు కోత విధిస్తూ మిల్లర్లు నిలువు దోపిడీకి తెరలేపారు.

లారీల కొరత: కొనుగోలు కేంద్రాల్లో అధికారులు కాంటా (తూకం) వేసినప్పటికీ, సకాలంలో లారీలు రాకపోవడంతో ఓపెన్ యార్డుల్లోనే ధాన్యం బస్తాలు ఉండిపోయాయి. రాత్రి కురిసిన వర్షానికి ఈ బస్తాలన్నీ తడిసి ముద్దయ్యాయి. సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు ఈ నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మెదక్ జిల్లాను ముంచెత్తిన వాన

ఉమ్మడి మెదక్ జిల్లాలో అకాల వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. మెదక్ రూరల్, హవేలి ఘనపూర్, పాపన్నపేట, కుల్చారం, కొల్చారం, చిల్పిచెడ్, చిన్న శంకరంపేట, రామాయంపేట, చేగుంట మండలాల్లోని కొనుగోలు కేంద్రాలు జలమయమయ్యాయి. తూకం వేసి లారీల కోసం ఎదురుచూస్తున్న వేలాది ధాన్యం బస్తాలు నీట మునిగాయి. కొన్నిచోట్ల రైతులు కప్పిన తార్పాలిన్లు సైతం ఈదురుగాలుల ధాటికి కొట్టుకుపోవడంతో వడ్ల కుప్పలు కొట్టుకుపోయాయి.

తక్షణమే కొనుగోలు చేయాలి: రైతుల డిమాండ్

రాష్ట్రంలో ఇంకా కొత్త లేబర్ కోడ్లు పూర్తిస్థాయిలో అమల్లోకి రాకపోయినా, పాత పద్ధతిలోనే కొనుగోళ్లు జరపడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని రైతు సంఘాలు మండిపడుతున్నాయి. తడిసిన ధాన్యానికి ఎలాంటి నిబంధనలు (మాయిశ్చర్ పర్సంటేజ్) పెట్టకుండా, క్వింటాలుకు పూర్తి మద్దతు ధర కల్పించి తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని, నష్టపోయిన ప్రతి గింజకూ పరిహారం అందించి అన్నదాతలను ఆదుకోవాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

**నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలివేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్**

**సకాలంలో కొనుగోళ్లు జరిపి ఉంటే రైతులకు ఈదుస్థితి వచ్చేది కాదు**

**హామీల అమల్లో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైంది మాజీ మంత్రి ధ్వజం**



**నిజామాబాద్ (మనసులో మాట):** అకాల వర్షాల కారణంగా కల్లాల్లో తడిసి ముద్దయిన వరి ధాన్యానికి ఎలాంటి నిబంధనలు పెట్టకుండా తక్షణమే కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐకేపీ, సహకార కేంద్రాల ద్వారా సకాలంలో ప్రభుత్వం పంట కొనుగోళ్లు చేపట్టి ఉంటే.. ఈరోజు అన్నదాతలకు ఈ కష్టాలు వచ్చేవి కాదన్నారు.

## హామీల అమల్లో విఫలం.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

చేయని వాగ్దానాలు, సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలులో పూర్తిగా విఫలమైందని వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డి సర్కార్ వైఖరిపై రాష్ట్ర ప్రజల్లో, ముఖ్యంగా రైతాంగంలో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి రగులుతోందని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనను గమనిస్తున్న ప్రజలు.. రోజురోజుకూ బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని, పార్టీకి ప్రజా మద్దతు క్షేత్రస్థాయిలో మరింత పెరుగుతోందని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కచ్చితంగా బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# పెళ్లిరోజు సందర్భంగా తిరుమల శ్రీవారి దర్శనం

**ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**



**ఇందూరు, మే 27, (మనసులో మాట):** కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వర ఆలయంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తన సతీమణితో కలిసి బుధవారం శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ పెళ్లిరోజు సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందూరు ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తొలగి వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వేడుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరికీ శ్రీవారి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- వర్షాలకు తడవకుండా టార్పాలిన్లు సిద్ధం చేయాలి: అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- రాష్ట్రంలో 'ఆరెంజ్ అలర్ట్'.. అత్యవసర పరిస్థితులపై యంత్రాంగం అప్రమత్తం
- అవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని ముఖ్యమంత్రి సూచన



**హైదరాబాద్ (మనసులో మాట):** వాతావరణ శాఖ రాష్ట్రంలోని పలు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో కురవబోయే భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై యంత్రాంగం నిరంతరం అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో (ఐకేపీ, సహకార కేంద్రాలు) అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని సీఎం స్పష్టం చేశారు.

## ధాన్యం సంరక్షణే ముఖ్యం!

రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం సంరక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

వేగవంతంగా కొనుగోళ్లు: కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రైతులకు ఎలాంటి ఆర్థిక నష్టం కలగకుండా చూడాలని మార్గనిర్దేశం చేశారు.

టార్పాలిన్ల లభ్యత: కల్లాల్లో, ఓపెన్ యార్డుల్లో నిల్వ ఉంచిన ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దవకుండా అవసరమైనన్ని టార్పాలిన్లను కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు.

సంచుల రీ-లొకేషన్: ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లు, గన్నీ సంచులను తక్షణమే ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రత విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు.

## అవసరం ఉంటేనే బయటకు రావాలి

వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలులు, మెరుపులతో కూడిన వానల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అత్యవసర పరిస్థితుల్లో విపత్తు నిర్వహణ బృందాలు, స్థానిక అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెట్ల కింద, కరెంట్ స్తంభాల వద్ద ఉండరాదని, ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా స్వయం నియంత్రణ, జాగ్రత్తలు పాటించాలని సీఎం సూచించారు.

# నిరుద్యోగ యువతకు న్యాక్ శిక్షణ

- ఉపాధికి సువర్ణావకాశం...



**నిజామాబాద్, మే 27 (మనసులో మాట):** జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో ఎలక్ట్రిషియన్, ప్లంబర్, మేసన్, టైలరింగ్ విభాగాల్లో మూడు నెలల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి తెలిపారు. ఈ శిక్షణకు మొత్తం రూ.18 వేల ఫీజు ఉండగా, జిల్లా యంత్రాంగం తరఫున 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో అభ్యర్థులు కేవలం రూ.9 వేల రుసుముతో శిక్షణ పొందవచ్చున్నారు. శిక్షణ కాలంలో అనుభవజ్ఞులైన శిక్షకులచే ప్రాక్టికల్స్, థియరీలో నాణ్యమైన శిక్షణ అందించబడుతుందని తెలిపారు. అభ్యర్థులకు ఉచిత యూనిఫామ్, స్టేషనరీ, ఆధునిక యంత్ర పరికరాలతో ప్రాక్టికల్ ట్రైనింగ్, న్యాక్ గుర్తింపు పొందిన సర్టిఫికేట్ అందించబడుతాయని చెప్పారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఉపాధి అవకాశాలు కూడా కల్పించబడతాయని కలెక్టర్ వెల్లడించారు. పదో తరగతి లేదా అంతకంటే పై విద్యార్హత కలిగి, 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు జూన్ 9వ తేదీలోపు నిజామాబాద్ కలెక్టరేట్ సమీపంలోని న్యాక్ కేంద్రంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు న్యాక్ సహాయ సంచాలకులు లింబాద్రిని 9296507557 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# బక్రీద్ పర్వదినం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక

- జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠీ





**నిజామాబాద్, మే 27, (మనసులో మాట):** పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో మత సామరస్యం, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని, ప్రజలందరూ పరస్పర గౌరవభావంతో కలిసిమెలిసి ఉండాలని కోరుకున్నారు. దానధర్మాలు, ప్రార్థనలు, సేవా కార్యక్రమాలతో బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. జిల్లా ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

# ముప్కాల్‌లో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలన

- భవనాన్ని వేగంగా పూర్తి చేయాలని అధికారులకు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశం



**నిజామాబాద్, మే 27, (మనసులో మాట):** నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య బుధవారం ముప్కాల్ మండలంలో నిర్మాణంలో ఉన్న నూతన పోలీస్ స్టేషన్ భవన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యత, పనుల పురోగతి, మరియు స్టేషన్‌లో ఆధునిక సౌకర్యాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా భవన నిర్మాణాన్ని వీలైనంత వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, సీఐ జాన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ అంజయ్య, ఎస్ఐ కిరణ్ పాల్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నెహ్రూ సేవలు చిరస్మరణీయం

## బొబ్బిలి రామకృష్ణ



**నిజామాబాద్, మే 27 (మనసులో మాట):** భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా బుధవారం నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో నేతలు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నెహ్రూ పార్క్‌లోని నెహ్రూ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం దేశ అభివృద్ధికి నెహ్రూ కీలక పునాదులు వేశారని తెలిపారు. భారీ పరిశ్రమలు, ఐఐటీలు, శాస్త్రీయ పరిశోధన సంస్థలు ఏర్పాటు చేయడంతో పాటు భాక్రా నంగల్, శ్రీరాంసాగర్ వంటి ప్రాజెక్టులతో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కల్పించారని పేర్కొన్నారు. దేశ పురోగతికి నెహ్రూ దూరదృష్టి ఎంతో దోహదపడిందన్నారు. ప్రస్తుతం కొందరు బీజేపీ నాయకులు నెహ్రూ సేవలను తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారని, చరిత్రను ఎవరూ మార్చలేరని ఆయన వ్యాఖ్యానించారు. యువత నెహ్రూ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# డిజిటల్ చెల్లింపులపై వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలి

## సీపీ సజ్జనార్

**హైదరాబాద్ (మనసులో మాట):** బక్రీద్ పండుగ నేపథ్యంలో డిజిటల్ చెల్లింపుల విషయంలో వ్యాపారులు, ముఖ్యంగా మేకలు, గొర్రెల విక్రయదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ (సీపీ) సీవీ సజ్జనార్ హెచ్చరించారు. ఇటీవల కాంచన్‌బాగ్, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నకిలీ పేమెంట్ యాప్ స్క్రీన్ షాట్లతో జరిగిన రెండు డిజిటల్ మోసాలు వెలుగులోకి వచ్చాయని ఆయన తెలిపారు. కాంచన్‌బాగ్‌లో కొంతమంది వ్యక్తులు వ్యాపారిని నమ్మించి, రూ. 5 వేలు చెల్లించినట్లు నకిలీ యాప్ స్క్రీన్ చూపి రూ. 68 వేల విలువైన పశువులతో పరారయ్యారని సీపీ పేర్కొన్నారు. అలాగే రాజేంద్రనగర్‌లోనూ నకిలీ యాప్ ద్వారా రూ. 48 వేల విలువైన మేకలను తీసుకెళ్లి బురిడీ కొట్టించారన్నారు. ఖాతాలో డబ్బులు జమ కాలేదని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. పశువులను అప్పగించే ముందే బ్యాంక్ ఖాతాలో బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలని, ఎవరైనా మోసానికి ప్రయత్నిస్తే వెంటనే 'డయల్ 100'కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సీపీ సజ్జనార్ సూచించారు.



# పేద ప్రజలకు సేవ చేయడం మాకు ఎంతో సంతృప్తి లభిస్తుంది

**రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్.ఓ.సీ అందజేసిన ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**ఎల్బీనగర్, మే 27 (మనసులో మాట):** ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోల్ డివిజన్ జైపూరి కాలనీలో నివాసం ఉంటున్న రుక్మిభాయ్ వెన్నుపూస సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా, కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బాధితురాలి వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా దరఖాస్తు చేయించారు. దీనికి సంబంధించి రూ.2 లక్షల ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు కాగా, బాధిత కుటుంబ సభ్యుడు రోహిత్‌కి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. "పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా మాకు ఎంతో సంతృప్తి లభిస్తుంది. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతోమంది పేద ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కింది" అని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యుడు రోహిత్ మాట్లాడుతూ.. తమ తల్లి ఆరోగ్య సమస్య విషయంలో సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందని, ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, చైతన్యపురి యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ మహిళా నాయకురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

**నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి**

**వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్**

**సకాలంలో కొనుగోళ్లు జరిపి ఉంటే రైతులకు ఈ దుస్థితి వచ్చేది కాదుహామీల అమల్లో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైంది: మాజీ మంత్రి ధ్వజం**

**నిజామాబాద్:** అకాల వర్షాల కారణంగా కల్లాల్లో తడిసి ముద్దయిన వరి ధాన్యానికి ఎలాంటి నిబంధనలు పెట్టకుండా తక్షణమే కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐకేపీ, సహకార కేంద్రాల ద్వారా సకాలంలో ప్రభుత్వం పంట కొనుగోళ్లు చేపట్టి ఉంటే.. ఈరోజు అన్నదాతలకు ఈ కష్టాలు వచ్చేవి కాదన్నారు.

**హామీల అమల్లో విఫలం.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత**

చేయని వాగ్దానాలు, సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలులో పూర్తిగా విఫలమైందని వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. రేవంత్ రెడ్డి సర్కార్ వైఖరిపై రాష్ట్ర ప్రజల్లో, ముఖ్యంగా రైతాంగంలో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి రగులుతోందని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనను గమనిస్తున్న ప్రజలు.. రోజురోజుకూ బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని, పార్టీకి ప్రజా మద్దతు క్షేత్రస్థాయిలో మరింత పెరుగుతోందని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కచ్చితంగా బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మూడో రోజుకు చేరిన ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె

- మోర్తాడ్‌లో జాతీయ రహదారి 63పై బైఠాయింపు
- రూ. 26 వేల వేతనం, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్



**బాల్కొండ, మోర్తాడ్ , మే 27 (మనసులో మాట):** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ ఐకేపీ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంలో వీఓఏలు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. స్థానిక జాతీయ రహదారి 63 పై బైఠాయించి, రవాణాను స్తంభింపజేశారు. "వీఓఏల ఐక్యత వర్ధిల్లాలి", "ఆవాజ్ దో – హమ్ ఏక్ హై" అంటూ ఆకాశం మిన్నంటేలా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం ప్రతినిధి కృప మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల బలోపేతం కోసం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి తమ ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలు అంశాలను తెరపైకి తెచ్చారు.

**వీఓఏల ప్రధాన డిమాండ్లు ఇవే:**

నెలకు రూ. 26,000 వేతనాన్ని ప్రభుత్వమే నేరుగా వీఓఏల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలి. స్పష్టమైన హెచ్‌ఆర్ పాలసీని అమలు చేస్తూ, అర్హత కలిగిన వీఓఏలను సీసీలుగా ప్రమోట్ చేయాలి. వీఓఏలందరికీ పూర్తి ఆరోగ్య భద్రత కల్పిస్తూ, రూ. 20 లక్షల ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి. ఆన్‌లైన్ పనులను మొబైల్ ఫోన్లలో చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. ప్రభుత్వమే ఉచితంగా ట్యాబ్‌లు, ఇంటర్నెట్ వసతి కల్పించాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చకపోతే, ఈ సమ్మెను రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మోర్తాడ్ మండల పరిధిలోని వివిధ గ్రామాల వీఓఏలు, మహిళా సంఘాల ప్రతినిధులు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటించారు.

# దూద్ గామ్ చెక్‌పోస్ట్ వద్ద సిపీ సాయి చైతన్య ఆకస్మిక తనిఖీలు

- చెక్‌పోస్ట్ వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీస్ కమిషనర్
- అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు: సీపీ పి. సాయి చైతన్య హెచ్చరిక



**మెండోరా, మే 27, (మనసులో మాట):** బక్రీద్ పండుగ సందర్భంగా అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య బుధవారం రోజున బాల్కొండ నియోజకవర్గం మెండోరా పోలీస్ స్టేషన్ పరిధిలోని దూద్ గామ్ చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్ డిస్ట్రిక్ బార్డర్ చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో మాట్లాడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. రాష్ట్ర సరిహద్దుల ద్వారా అక్రమంగా పశువులను తరలించే వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అనుమానాస్పద వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. వాహనాల తనిఖీల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. రాత్రి వేళల్లో రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించడం, బ్యారికేడ్లు మరియు హెచ్చరిక లైట్లు వినియోగించడం, వాహనాలను సురక్షిత ప్రాంతాల్లో నిలిపి తనిఖీలు నిర్వహించడం వంటి భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. చట్ట విరుద్ధంగా పశువుల రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, మెండోరా ఎస్ఐ సుహాసిని మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రొఫెసర్ నాగేశ్వర్ అరెస్ట్ ప్రచారం దుర్మార్గం

**సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి ధ్వజం**

**హైదరాబాద్ (మనసులో మాట):** ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావు ఏపీ ప్రభుత్వంపై చేసిన విమర్శల నేపథ్యంలో ఆయనను అరెస్ట్ చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను తెలంగాణ ఉద్యమనేత, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేదా అని ఆయన పాలకులను నిలదీశారు. కేవలం విమర్శలు చేసినందుకు ఒక మేధావిని అరెస్ట్ చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ సందర్భంగా ఆయన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై ఘాటైన విమర్శలు చేశారు. ఒకప్పుడు చేగువేరా సిద్ధాంతాలను గుండెలకు హత్తుకున్న పవన్ కళ్యాణ్, ఈరోజు స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు బొమ్మను పట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. మేధావి, విద్యావేత్త అయిన ప్రొఫెసర్ నాగేశ్వర్‌తో పోలిస్తే పవన్ కళ్యాణ్ ఒక 'లిల్లిపుట్' లాంటివాడని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ మరణానికి కారకుడైన వ్యక్తి మళ్లీ సీఎం కావడం, రోజుకో రంగు మార్చే నాయకులు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మరోవైపు, తెలంగాణలో మీడియా అక్రిడిటేషన్లు, ఛానళ్ల యాజమాన్యాలపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వరాష్ట్రంలో స్థానిక జర్నలిస్టులకు కాకుండా, ఆంధ్రా ప్రాంతానికి చెందిన జర్నలిస్టులకే అక్రిడిటేషన్ కార్డులు ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో వీ6, టీ న్యూస్ మినహా మిగిలిన ప్రధాన వార్తా ఛానళ్లన్నీ ఆంధ్రా యాజమాన్యాల చేతుల్లోనే ఉన్నాయని, మీడియా రంగంలో ఇప్పటికీ వారి ఆధిపత్యమే నడుస్తోందని పాశం యాదగిరి స్పష్టం చేశారు.

# రైతుల ఆగ్రహంలో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయం

- ధాన్యం సేకరణలో ఎప్పుడూ లేనంత నిర్లక్ష్యం: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధ్వజం
- పెద్దమందడి మండలంలో కొనుగోలు కేంద్రాల సందర్శన.. 'రేవంత్ తుగ్లక్ పాలన'పై నిప్పులు
- దళారుల కోసమే కొనుగోళ్లలో ఉద్దేశపూర్వక జాప్యం: బీఆర్ఎస్ నేత తీవ్ర ఆరోపణ

**వనపర్తి (మనసులో మాట):** అన్నదాతలకు దుర్భర పరిస్థితులు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆగ్రహంలో మట్టికొట్టుకుపోవడం ఖాయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ప్రస్తుత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. బుధవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులను



అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

### రైతాంగంపై కాంగ్రెస్ కుట్రపూరిత వైఖరి

రాష్ట్రంలోని అన్నదాతలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం చేతులెత్తేసిందని, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దారుణాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతగానితనం, నిర్లక్ష్యమే కారణమని ఆయన దుయ్యబట్టారు. రైతులను ఉద్దేశపూర్వకంగానే ఇబ్బందులకు గురిచేస్తూ సకాలంలో యూరియా అందుబాటులో ఉంచకుండా, కరెంట్ సరఫరాలో కోతలు పెడుతూ, కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుతో విసిగిపోయిన రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటే, ప్రభుత్వంపై కొనుగోలు భారం పడకుండా ఉంటుందనే కుట్రతోనే రేవంత్ రెడ్డి ఈ విధమైన పన్నాగం పన్నారని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు.

### నాడు కేసీఆర్ పాలన.. నేడు రేవంత్ తుగ్లక్ రాజ్యం!

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిన విషయాన్ని నిరంజన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు.

కేసీఆర్ హయాంలో: నాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంట చేతికి రాగానే తక్షణమే కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించి, కేవలం వారం రోజుల్లోనే నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేశారని వివరించారు. రేవంత్ పాలనలో: నేడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తుగ్లక్ పాలన'లో రైతులు తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి నెలల తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోందని, ఓపెన్ యార్డుల్లోనే మగ్గిపోవాల్సి వస్తోందని ఆయన దుయ్యబట్టారు.

# కల్లాల వద్ద దైన్యంగా రైతులు.. పంటల కొనుగోలు లేక దీనావస్థ

- తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలి: ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం
- అన్నదాతలకు బీఆర్ఎస్ శ్రేణులు అండగా నిలవాలి: పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు
- సెల్‌ఫోన్ వెలుతురులో వడ్లు కాపాడుకుంటున్న దుస్థితి.. కాంగ్రెస్ సర్కార్‌ది మొద్దునిద్ర

**హైదరాబాద్(మనసులో మాట):** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా అనేక అగ్రికల్చరల్ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, సంక్షోభంలో ఉన్న రైతాంగానికి ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ ఆపత్కాలంలో రైతు సోదరులకు భరోసా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

### ప్రభుత్వ అనాలోచిత వైఖరి వల్లే రైతులకు శాపం!

ఉమ్మడి కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలతో సహా రాష్ట్రవ్యాప్తంగా గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వరద నీటిలో కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరు మున్నీరవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మొద్దునిద్రలో సర్కార్ కొనుగోలు కేంద్రాల వద్ద కరెంట్ లేక, చీకట్లో సెల్‌ఫోన్ల వెలుతురులోనే రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు.

ముందుచూపు కరవు: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే ఆరుగాలం కష్టం కళ్లముందే నీటిపాలవుతోందని ధ్వజమెత్తారు.

### క్షేత్రస్థాయిలోకి వెళ్లండి గులాబీ శ్రేణులకు ఆదేశం

ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ తక్షణమే క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వెంటనే తమ పరిధిలోని అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ



సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు.

### నిబంధనలు లేకుండా మద్దతు ధర ఇవ్వాలి

మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యానికి తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధర (మీరా) కల్పించి ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# గోనె సంచుల్లో డబ్బుల మూటల తరలింపు

#### అందుకే కొరత: ఆర్ఎస్పీ ఆరోపణ

**హైదరాబాద్(మనసులో మాట):** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గోనె సంచుల సరఫరా లేక ధాన్యం అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ (ఆర్ఎస్పీ) విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావలసిన గోనె బస్తాలు ఎందుకు లేవో తెలుసా? అని ప్రశ్నించిన ఆయన.. మన రక్తాన్ని పిండి సంపాదించిన డబ్బును ఆ గోనె బస్తాల్లో మూటలుగా కట్టి, మొత్తం ప్యాక్ చేసి ఢిల్లీకి తరలిస్తున్నారని ఆరోపించారు. అందుకే తెలంగాణలో గోనె సంచులు దొరకడం లేదన్నది వాస్తవమని పేర్కొన్నారు. తెలంగాణలో డబ్బులు లేకుండా మొత్తం అక్కడికే తరలిపోతోందని ఆర్ఎస్పీ విమర్శించారు.



# కాళేశ్వరంలో ముగింపునకు సరస్వతి అంత్య పుష్కరాలు

### ఘాట్ల వద్ద పోటెత్తిన భక్తుల రద్దీ.. పవిత్ర స్నానాలు ఆచరించిన హంపి పీఠాధిపతి కాళేశ్వరంలో భక్తుల జాతర!

**కాళేశ్వరం (మనసులో మాట):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు భక్తులు పోటెత్తుతున్నారు. పుష్కర ఘాట్ల వద్ద తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని త్రివేణీ సంగమ పవిత్ర పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళ హారతులు, నిరంతర ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రం మారుమోగుతోంది. ఈ నెల 21న ప్రారంభమైన ఈ అంత్య పుష్కరాలు ముగింపునకు చేరుతుండటంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి నదీ స్నానాలు ఆచరిస్తున్నారు. ఈ పుష్కర పుణ్యస్నానాలకు తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా భక్తులు వేల సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుంటున్నారు. పుష్కరాల సందర్భంగా హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామివారు కాళేశ్వర క్షేత్రాన్ని సందర్శించి, పుష్కర ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, పవిత్ర స్నానం ఆచరించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించి, పుష్కరాల విశిష్టతను, వాటి ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను వివరించారు. అలాగే దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు క్షేత్రానికి చేరుకుని పుష్కర స్నానం ఆచరించి, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అంత్య పుష్కరాల సందర్భంగా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో సకల ఐశ్వర్య ప్రదాత అయిన దుర్గాదేవి అమ్మవారికి 'దుర్గా సూక్త హోమం' అత్యంత వైభవంగా జరిగింది. పండితులు వేద మంత్రాల నడుమ హోమ క్రతువులను నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ సంస్థ సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులను నడుపుతోంది. పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి సెట్టింగ్స్, సరస్వతి మాత, శివుని విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటూ మంత్రముగ్ధులను చేస్తున్నాయి. అక్కడికి చేరుకున్న భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో, కుటుంబాలతో వచ్చిన భక్తులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. పుష్కరాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో ప్రతి మంగళ, గురువారాల్లో కాలసర్పదోష పూజలు నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ కాగా, పుష్కరాల రద్దీ నేపథ్యంలో ఈ పూజలను తాత్కాలికంగా నిలిపివేశారు. భక్తులు పుష్కర స్నానం ఆచరించి నేరుగా ఆలయంలో ముక్తేశ్వరుడిని దర్శించుకుంటున్నారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు.



## బొగ్గు మాయం ఆరోపణల నుండి దృష్టి మళ్లించేందుకే నాపై కుట్రలు

**బాల్క సుమన్**



**హైదరాబాద్ (మనసులో మాట):** సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయంపై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన సంచలన ఆరోపణల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ మంత్రులు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మిక సంఘం సమావేశంలో తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి, కాంగ్రెస్ ఎమ్మెల్సీలు తనపై డీజీపీకి ఫిర్యాదు చేయడం చీప్ ట్రిక్ అని మండిపడ్డారు. సింగరేణిని సీఎం బావమరిదికి అప్పగించారని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తనపై 226 కేసులు నమోదయ్యాయని, ప్రజల దృష్టిని మరల్చేందుకు తనను మళ్లీ జైలుకు పంపాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీని కాలుస్తానన్న జడ్చర్ల ఎమ్మెల్యేపై, నరుకుతా అన్న రామగుండం ఎమ్మెల్యేపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ఏ వర్గమూ సంతోషంగా లేదని, శ్రీలంక, బంగ్లాదేశ్ తరహాలోనే ఇక్కడ కూడా ప్రజా తిరుగుబాటు వస్తుందని బాల్క సుమన్ హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.

## మోపాల్ మండలంలో చిరుత సంచారం

**సీసీటీవీలో రికార్డైన దృశ్యాలు.. జనం భయాందోళన**

**నిజామాబాద్ (మనసులో మాట):** జిల్లాలోని మోపాల్ మండలంలో చిరుత పులి సంచారం తీవ్ర కలకలం రేపింది. మండల పరిధిలోని సిరిపూర్ గ్రామంలో రాత్రి వేళ చిరుత సంచరించినట్లు స్థానికులు గుర్తించారు. గ్రామ శివారులో ఉన్న ఒక పశువుల పాక సమీపంలోకి చిరుత రావడాన్ని గమనించిన కుక్క గట్టిగా మొరగడంతో, చిరుత అక్కడి నుండి వెనుతిరిగి వెళ్లిపోయింది. అయితే, ఈ దృశ్యాలన్నీ స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డయ్యాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సిరిపూర్ గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల జనం తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావడానికి, పొలాలకు వెళ్లడానికి రైతులు, కూలీలు జంకుతున్నారు. ఎప్పుడు ఏ వైపు నుండి చిరుత దాడి చేస్తుందోనని స్థానికులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి, గ్రామంలో బోన్లు ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని, తమకు రక్షణ కల్పించాలని సిరిపూర్ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



# ఖాదీ బోర్డు కాలనీ లో హైడ్రా

- కబ్జాదారు గుండెల్లో గుబులు
- హయత్ నగర్ లో పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా
- ఆనందాన్ని వ్యక్తం చేసిన కాలనీవాసులు





**రంగారెడ్డి, మే 27 ( మనసులో మాట):** రంగారెడ్డి జిల్లా, హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బాగ్ హయత్ నగర్, ఖాదీ బోర్డు కాలనీ, సర్వే నంబర్లు 233, 234, 235, 236 పరిధిలో ఉన్న మా కాలనీ 1984 సంవత్సరంలో లేఅవుట్ చేయబడింది. ప్లాట్ నంబర్లు 69, 70, 47, 48 ప్రాంతం మొదటి నుంచే కాలనీ పార్క్‌గా ఉపయోగించబడుతూ వస్తోంది. గత నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రదేశంలో గణేష్ నవరాత్రులు, అమ్మవారి పూజలు, బతుకమ్మ పండుగలు, జెండా వందనం వంటి అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ కాలనీ ప్రజలు ఎంతో ప్రేమతో ఈ పార్క్‌ను కాపాడుకుంటూ వచ్చారు. అయితే ఇటీవల కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఫేక్ డాక్యుమెంట్ల ఆధారంగా ఈ నాలుగు ప్లాట్లు తమవి అని చెప్పి, మార్చి 24న రిజిస్ట్రేషన్ చేసుకున్నామని పేర్కొంటూ కాలనీలోకి వచ్చి పార్క్ బోర్డులు, ప్రీకాస్ట్ నిర్మాణాలు, జెండాలకు సంబంధించిన ఏర్పాట్లు ధ్వంసం చేశారు. దీంతో కాలనీ ప్రజలంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ విషయంలో మేము సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా, హైడ్రా అధికారులు వెంటనే స్పందించి పూర్తి వివరాలు, డాక్యుమెంట్లు పరిశీలించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎంతో బాధ్యతతో వ్యవహరించి, కాలనీ ప్రజలు, కొనుగోలు చేసిన వారిని పిలిపించి సమావేశం నిర్వహించారు. వారి డాక్యుమెంటేషన్‌లో లోపాలు ఉన్నాయని స్పష్టంగా తెలియజేసి, అక్రమంగా ఏర్పాటు చేసిన నిర్మాణాలను తొలగించే చర్యలు తీసుకున్నారు. పార్క్ చుట్టూ తిరిగి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కాలనీ ప్రజలకు న్యాయం చేశారు. 42 సంవత్సరాలుగా ఈ స్థలం ఎప్పుడూ రిజిస్ట్రేషన్ కాలేదని, ఈసీ తీసినా "నిల్" గానే వచ్చిందని అందరికీ తెలుసు. అలాంటి స్థలాన్ని అకస్మాత్తుగా రిజిస్ట్రేషన్ చేయడం చాలా అనుమానాస్పదం. వ్యవస్థలోని కొన్ని లోపాలను ఉపయోగించుకుని ఇలాంటి పనులు చేసిన వారిపై సరైన చర్యలు తీసుకోవాలని మేము కోరుకుంటున్నాం. మా కాలనీకి ఉన్న ఏకైక పార్క్‌ను కాపాడి, మా సమస్యను మర్యాదపూర్వకంగా, వేగంగా పరిష్కరించిన హైడ్రా అధికారులకు, కమిషనర్ రంగనాథ్ లకు కాలనీ ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. మీ సహాయం వల్ల మా కాలనీ ప్రజలకు ఎంతో న్యాయం జరిగిందని కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆర్‌టీఓ ఆఫీసులపై ఏసీబీ పంజా

- మేడ్చల్, నాగోల్, కొండాపూర్‌లో ఏకకాలంలో దాడులు
- నగరంలోని ఆర్‌టీఓ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు అక్రమాలపై ఆరా




**హైదరాబాద్ ( మనసులో మాట):** హైదరాబాద్ నగరంలోని పలు ఆర్‌టీఓ (RTO) కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. మేడ్చల్, నాగోల్, కొండాపూర్ ఆర్‌టీఓ కార్యాలయాల్లో దాదాపు 8 మంది అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు ఏకకాలంలో ఈ తనిఖీలు చేపట్టాయి. ఆర్‌టీఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు రావడంతో ఏసీబీ ఈ దాడులు నిర్వహించినట్లు సమాచారం. కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియపై అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. అలాగే, ఆర్‌టీఓ ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను కూడా అధికారులు విచారిస్తున్నారు. ఏజెంట్ల ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర రిజిస్ట్రేషన్ పనులు అక్రమంగా సాగుతున్నాయనే పక్కా సమాచారంతోనే ఈ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

# రెవెన్యూ శాఖలో భారీగా తహశీల్దార్ల బదిలీ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్ ( మనసులో మాట):** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 12 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులు తక్షణమే కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని, ఆ వివరాలను ప్రభుత్వానికి సమర్పించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్, జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. బదిలీ అయిన అధికారులు, వారి కొత్త పోస్టింగుల వివరాలు కింది విధంగా ఉన్నాయి

**అధికారి పేరుప్రస్తుత స్థానం జిల్లాబదిలీ అయిన కొత్త పోస్టింగ్మోతీరామ్**

ఎ. నిర్మల్మంచిర్యాల డీఆర్ఓ (DRO)బి. రాజేశ్వరి కరీంనగర్పెద్దపల్లి డీఆర్ఓ (DRO)కె.వై. ప్రసాద్పెద్దపల్లిజగిత్యాల డీఆర్ఓ (DRO)ఆర్. పాండువవనపర్తినాగర్‌కర్నూల్ డీఆర్ఓ (DRO)వి. రవికుమార్ఖమ్మంములుగు డీఆర్ఓ (DRO)జే. స్వామిమేడ్చల్ – మల్కాజ్‌గిరి కరీంనగర్ డీఆర్ఓ (DRO)ఎ. పాండునాగర్ కర్నూల్కామారెడ్డి డీఆర్ఓ (DRO)సిహెచ్. శ్రీకాంత్జనగామమహబూబ్ నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏఎం. సుదర్శన్ రెడ్డిసూర్యాపేటసిద్దిపేట ఎస్‌డీసీ (SDC)ఎం. రమాదేవిఖమ్మంనల్గొండ ఎస్‌డీసీ (SDC)జి. కుమారస్వామి పెద్దపల్లి సిరిసిల్ల ఎస్‌డీసీ (SDC)ఎన్. వెంకట్ రెడ్డికరీంనగర్కరీంనగర్ ఎస్‌డీసీ (LA)

# పోలీస్ కస్టడీలోకి బండి భగీరథ్

- సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్ తరలింపు

**హైదరాబాద్ ( మనసులో మాట):** పోక్సో (గాజూరా) కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను బుధవారం పేట్ బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం కేసు దర్యాప్తులో భాగంగా సీన్ రీకన్‌స్ట్రక్షన్ (ఘటనా స్థల పరిశీలన) కోసం ఆయనను మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తరలించారు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడనే ఆరోపణలపై మే 16న పేట్ బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుండి ఆయన చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కేసులో మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉన్నందున వారం రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం భగీరథ్‌ను మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు అనుమతితో చంచల్‌గూడ జైలు నుండి భగీరథ్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించిన



అధికారులు, మూడు రోజుల పాటు ఆయనను లోతుగా విచారించనున్నారు.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### కేటీఆర్ సవాల్‌పై ఘాటు విమర్శలు

**హైదరాబాద్(మనసులోమాట):** రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌లతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, జూన్ చివరి నాటికి మరో లక్ష ఇళ్లు పూర్తి కావస్తాయని వెల్లడించారు. తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, జీహెచ్ఎంసీ పరిధిలో స్థల కొరత వల్ల ప్రస్తుతం 18 వేల ఇళ్లు మంజూరు చేశామన్నారు. మహిళల పేరు మీద రూపాయి ఫీజు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి, సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇళ్లను పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

### కేటీఆర్ సవాల్‌పై మంత్రి పొంగులేటి ప్రతిసవాల్:

ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి పొంగులేటి మధ్య మాటల యుద్ధం ముదిరింది. హైదరాబాద్‌లో ఒక్క ఇందిరమ్మ ఇల్లైనా కట్టి ఉంటే రాజకీయ సన్యాసం తీసుకుంటానంటూ కేటీఆర్ విసిరిన సవాల్‌పై పొంగులేటి ఘాటుగా స్పందించారు. "పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా కట్టలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500 పైగా ఇళ్లు ఇచ్చాం. గత ప్రభుత్వం కంటే ఎక్కువ ఇళ్లు కట్టి చూపిస్తాం.. అప్పుడు మీరు ఎన్నికల పోటీకి దూరంగా ఉంటారా?" అంటూ కేటీఆర్‌కు ప్రతిసవాల్ విసిరారు. ఫామ్‌హౌస్‌లకే



పరిమితమైతే ప్రజా సమస్యలు ఏం తెలుస్తాయని కేటీఆర్‌ను ఎద్దేవా చేశారు. జూన్ 1న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మరో 2.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే వీఆర్ఎస్ (రాజకీయ సన్యాసం) ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, కాబట్టి కేటీఆర్ ప్రత్యేకంగా సన్యాసం తీసుకోనక్కర్లేదంటూ పొంగులేటి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# వక్ఫ్ భూముల గొడవలే కారణం

### న్యాయవాది మొయినుద్దీన్ హత్య కేసులో తండ్రీకొడుకుల అరెస్ట్

**హైదరాబాద్(మనసులోమాట):** నగరంలో సంచలనం సృష్టించిన ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. వక్ఫ్ బోర్డు భూముల వివాదం కారణంగానే ఈ హత్య జరిగినట్లు నిర్ధారించిన పోలీసులు, దీనితో సంబంధం ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఒక ప్రముఖ రాజకీయ నేతను, ఆయన కుమారుడిని బుధవారం అరెస్ట్ చేశారు. ప్రస్తుతం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి లోతుగా విచారిస్తున్నారు. రూ. 15 లక్షల సుపారీతో ఘాతుకం: హైదరాబాద్‌లోని మలక్‌పేట్, లక్డీకాపూల్, మల్లేపల్లి ప్రాంతాల్లోని వక్ఫ్ బోర్డు భూముల రక్షణ కోసం న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ సుదీర్ఘంగా పోరాడుతున్నారు. ఈ క్రమంలో సదరు రాజకీయ నేతను వక్ఫ్ బోర్డు నుండి తప్పించడానికి ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. దీనిని మనసులో పెట్టుకున్న



ఆ రాజకీయ నేత, ఆయన కుమారుడు కలిసి రూ. 15 లక్షల సుపారీ (హత్యకు డబ్బులు) ఇచ్చి మొయినుద్దీన్‌ను హత్య చేయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మే 23న మాసబ్ ట్యాంక్ సమీపంలో మొయినుద్దీన్ తన కార్ ఎక్కుతుండగా, వెనుక నుండి వేగంగా వచ్చిన ఒక కార్ ఆయనను బలంగా ఢీకొట్టి పరారైంది. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. మొదట దీనిని 'హిట్ అండ్ రన్' ప్రమాదంగా భావించినప్పటికీ, కుటుంబ సభ్యుల అనుమానాలతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా, ఢీకొట్టిన కార్‌కు నంబర్ ప్లేట్ లేకపోవడంతో ఇది పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హత్యగా పోలీసులు నిర్ధారించారు. ప్రత్యేక బృందాలతో గాలించి నిందితులను పట్టుకున్నారు.

# శామీర్‌పేటలో ఏసీబీ దాడులు

**30 ఎకరాల భూమి కన్వర్షన్ కోసం లంచం డిమాండ్**

**రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన డ్రైవర్**

**కీలక పత్రాలు స్వాధీనం.. ఎమ్మార్వో, ఆర్డీవో విచారణ**

**అవినీతి ఫిర్యాదులపై తనిఖీలు చేపట్టాం: ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్**



**మేడ్చల్, మే 26 (మనసులో మాట ప్రతినిధి):** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టినట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ వెల్లడించారు.

### ఎకరానికి లక్ష రూపాయలు డిమాండ్

ఎకరానికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నామని వివరించారు. ఎమ్మార్వో సుచరితతో పాటు ఆర్డీఓ కీసర రాజేష్, పలువురు సిబ్బందిని విచారిస్తున్నామని, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

### పునరావృతమైన అవినీతి ఘటన

ఇలా ఉండగా, 2024లో కూడా శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఎమ్మార్వో సత్యనారాయణ రూ.2 లక్షల లంచం కేసులో డ్రైవర్‌తో కలిసి ఏసీబీకి చిక్కిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా మరోసారి అదే కార్యాలయంలో ఏసీబీ దాడులు జరగడం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**వరంగల్, మే 26 (మనసులో మాట):** రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ (ఐఏఎస్) మంగళవారం వరంగల్ జిల్లాలో పర్యటించారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్ధన్నపేట మండలం కత్రియాల పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు, తరలింపు ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన ట్యాబ్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు వేగంగా డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్‌లోని సాయి సంతోష్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును శ్యామ్ ప్రసాద్ సందర్శించారు. మిల్లులో ధాన్యం దించే (అన్‌లోడింగ్) ప్రక్రియను వేగవంతం చేసేందుకు తగిన సంఖ్యలో హమాలీలను నియమించాలని సూచించారు. పర్యటన అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

# ఇండ్ల గణన ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, మే 27 (మనసులో మాట ప్రతినిధి):** జనగణనలో భాగమైన ఇండ్ల గణన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ గ్రామంలో కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌస్ లిస్టింగ్ జనగణనలో కీలక ఘట్టమని, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలు, పూర్తయిన ఇండ్ల వివరాలను తెలుసుకుని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రజల నుంచి సేకరించే సమాచారం ఖచ్చితత్వంతో ఉండాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని తెలిపారు. జనగణన ద్వారా సేకరించే సమాచారం ఆధారంగానే ప్రభుత్వాలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రూపొందిస్తాయని పేర్కొంటూ ప్రజలు కూడా పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనగణన సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో ప్రతి సీటు భర్తీ కావాలి

**భట్టి విక్రమార్క**

**ఖమ్మం, మే 27(మనసులో మాట ప్రతినిధి):** రాబోయే విద్యా సంవత్సరానికి గురుకులాలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో ప్రతి సీటు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని, సీట్లు ఖాళీగా ఉన్న పాఠశాలలపై ప్రత్యేక అధ్యయనం చేసి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. జూన్ 12 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో మరమ్మతులు, మౌలిక వసతుల పనులు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి గురుకులానికి జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, నెలకు ఒకసారి పాఠశాలలను తనిఖీ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు ప్రతి నెల పరిశీలించాలని సూచించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు సకాలంలో అందించాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాల పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. స్వంత భవనాల్లో నడుస్తున్న గురుకులాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.



# వ్యవసాయ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి కావాలి

- రైతులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎదగాలి
- ఈ-కామర్స్ వేదికలను వినియోగించుకోవాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి




**నిజామాబాద్, మే 26 (మనసులో మాట ప్రతినిధి):** నిజామాబాద్ జిల్లాలో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను దేశ విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకాంక్షించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, డీజీఎఫ్‌టీఈ, ఏపీఈడీఏ, జాతీయ పసుపు బోర్డు, నాబార్డు, ఇండియా పోస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్మూర్ ప్రాంతంలో పసుపు సాగు, అంకాపూర్ రైతుల ఆధునిక వ్యవసాయ విధానాలు రాష్ట్రానికి ఆదర్శమన్నారు. రైతులకు విదేశీ మార్కెట్లపై అవగాహన కల్పించి, వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతులతో అనుసంధానం చేస్తే మరింత లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పసుపు, వరి, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి పంటల మార్కెటింగ్, నాణ్యత పెంపు, ఈ-కామర్స్ ఎగుమతులు, ఆధునిక సాగు పద్ధతులపై అధికారులు, శాస్త్రవేత్తలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు.

**అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం**

డీజీఎఫ్‌టీఈ ప్రాంతీయ సంచాలకులు ఎస్.ఏ. చవాన్ మాట్లాడుతూ తెలంగాణ నుంచి ఇప్పటికే ఔషధాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని, ఇదే తరహాలో పసుపు, వరి వంటి వ్యవసాయ ఉత్పత్తులను కూడా పెద్ద ఎత్తున ఎగుమతి చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులు ఈ-కామర్స్ వేదికలను వినియోగించుకొని జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు, వ్యవసాయ విశ్వవిద్యాలయం, నాబార్డు, ఉద్యానశాఖ అధికారులు, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

# మిల్లుల్లో వరి ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి

**కలెక్టర్ హైమావతి**



**సిద్దిపేట, మే 27(మనసులో మాట):** జిల్లాలోని రైస్ మిల్లుల్లో వరి ధాన్యం దిగుమతిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు. బుధవారం చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలోని శివసాయి బాలాజీ రైస్ మిల్, ముస్యాల గ్రామ శివారులోని శ్రీ రేణుక బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లుల్లో దాదాపు 30 వాహనాల ధాన్యం దిగుమతికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఆలస్యం జరుగుతోందన్నారు. మిల్లుల్లో దిగుమతి జాప్యం కారణంగా కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఎక్కువ పాయింట్లు ఏర్పాటు చేసి ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్ యజమానులకు సూచించారు. గ్రామాల్లో స్థానిక హమాలీలను వినియోగించుకుని కొనుగోలు కేంద్రాలు, మిల్లుల్లో పనులు సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. ధాన్యం దిగుమతికి అవసరమైన గోదాముల అన్వేషణపై స్థానిక తహసీల్దార్ దృష్టి పెట్టాలని ఆదేశించారు. ధాన్యం దిగుమతి పూర్తైన వెంటనే మిల్లర్ అక్నాలెడ్జ్‌మెంట్, ట్రక్ షీట్ జనరేషన్, ఓపీఎంఎస్ అప్‌లోడ్ వంటి ప్రక్రియలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, మే 27 (మనసులో మాట):** లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి, మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన మున్సిపల్ శాఖ ప్రగతిపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పట్టణాల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని శానిటేషన్, ఇంజినీరింగ్ పనులు, ఆదాయ వనరుల సేకరణ, టౌన్ ప్లానింగ్, పార్కుల అభివృద్ధిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని, నిరంతరం చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలతో మున్సిపల్ ఇంజినీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే గాంధీ పార్క్ డెవలప్మెంట్ పనులను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజా వినియోగంలోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఆదాయ వనరులను మెరుగుపరచడంపై సమీక్షిస్తూ, ఆస్తి పన్ను వసూళ్లలో 'ఎర్లీ బర్డ్ ఆఫర్'ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, నిర్దేశిత లక్ష్యాలను వంద శాతం సాధించాలని దిశానిర్దేశం చేశారు. వ్యాపార సంస్థల ట్రేడ్ లైసెన్స్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులను ఎలాంటి ఆలస్యం లేకుండా, నిబంధనల ప్రకారం పారదర్శకంగా జారీ చేయాలని స్పష్టం చేశారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేసి మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, సంబంధిత మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పిడి రాజు ఇంజినీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

